సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 24 । జనవరి । 2024



ఆరోగ్య యోగం

వ్యాయామం లేకపోతే శారీరక సమస్యలే కాదు మానసిక సమస్యలు కూడా చుట్టుముడతాయి. ఇలాంటి సమస్యలకు సరైన పరిష్కారమే సూర్యనమస్కారం. -10లో



బాబు కుట్రలో భాగమే షర్మిల

టీడీపీ అధినేత చంద్రబాబు తన కుట్రలో భాగంగానే.. షర్మిలను రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకొచ్చారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 128 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

25న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



నందలూరు(రాజంపేట): ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 25వ తేది ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వహకులు సయ్యద్ అమీర్, కరిముల్లాఖాన్ తెలిపారు. అరవపల్లి జిల్లాపరిషత్ క్రీడా మైదానంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబడ్డీ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 7 వేలు, తృతీయ బహుమతి రూ. 5 వేలు, నాల్గవ బహుమతి రూ. 3 వేలు నగదు ఉంటుందన్నారు. ఈనెల 24వ తేదిలోపు పోటీలో పాల్గొనేవారు జట్టుపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 90005 27227, 8309199305, 9866015602 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

హెడ్ నర్సులకు పదోన్నతి



పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో మంగళవారం హెడ్ నర్స్ నుంచి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. తొమ్మిది మందికి పదోన్నతులు కల్పించి, పోస్టింగ్‌లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అర్హులైన ఉద్యోగులకు రాయలసీమ జిల్లాల పరిధిలో పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంపీఈడీ, ఎంసీఏ, బీఎఫ్ఏ విద్యార్థులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆర్ట్స్‌బ్లాక్, సైన్స్‌బ్లాక్, గురుకులం భవనాల్లో పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలను విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలిరోజు నాన్‌కోర్ పరీక్షకు 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం నుంచి 900 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. పరీక్షల ఏర్పాట్లను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

ముగిసిన ఏహెచ్‌ఏ అభ్యర్థుల పత్రాల పరిశీలన



పత్రాల పరిశీలనను పర్యవేక్షిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్: ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా ఏహెచ్ఏ(అనిమల్ హస్బండరీ అసిస్టెంట్) పోస్టుల భర్తీకి సంబంధించి కడపలోని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల పత్రాల పరిశీలన ముగిసింది. రెండో రోజైన మంగళవారం 77 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, సైనిక్ శాఖ అధికారులు పాల్గొని అభ్యర్థుల విద్యార్హత, కుల ధ్రువీకరణ, స్థిర నివాస పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మ పర్యవేక్షించారు. రెండు రోజుల్లో మొత్తం 210 మంది అభ్యర్థులకు గాను 136 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడీలు శ్రీధర్‌లింగారెడ్డి, ఉత్తయ్య, శ్రీనివాసులరెడ్డి, పలు మండలాల పశువైద్యులు మారుతీ ప్రతాప్‌రెడ్డి, సురేష్, ఉపేంద్రతోపాటు అన్ని డివిజన్ల సీనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా సమయం!



వరుణ్ మదనపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రాత్రి 11 వరకు పుస్తకాలతో కుస్తీపడతాడు. ఉదయం పాఠశాలలో టీచర్ ప్రశ్నలు అడిగితే సమాధానాలు చెప్పలేకపోతున్నాడు. రాత్రి చదివిందంతా ఉదయానికి గుర్తు చేసుకోలేకపోతున్నాడు.

మదనపల్లెకు చెందిన శ్రీ విద్య ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. పరీక్షల్లో మార్కులను ప్రామాణికంగా తీసుకుని బాగా చదువుతోంది. తొలుత ఎఫ్–1 సెక్షన్‌కు ప్రమోట్ చేశారు. బాగా చదివేది. నిత్యం హుషారుగా కాలేజీకి వెళ్లేది. ఏమైందో ఏమో ఈసారి ఆ బాలికను అంతగా చదవడం లేదని ఎఫ్–3 సెక్షన్‌కు డిమోట్ చేశారు. దీంతో దాన్ని అవమానంగా (ఇన్సల్ట్)గా భావించి అన్నం తినకపోవడం, సరిగా నిద్రపోకపోవడం వంటివి చేస్తోందని గుర్తించి తల్లిదండ్రులు సైకాలజిస్టును సంప్రదించారు.

వాల్మీకిపురానికి చెందిన మహేష్ ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గతంలో మొబైల్ ఫోన్లో ఆటలాడటం, సినిమాలు చూడటం వంటివి చేసేవాడు. పరీక్షలు దగ్గరపడటంతో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వాడకాన్ని కట్టడి చేశారు. దీన్ని తట్టుకోలేక ఫోన్ ఇవ్వపోతే పాఠశాలకు వెళ్లనని మొండికేశాడు. దీంతో తల్లిదండ్రులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు.



- పరీక్షల సమయాల్లో విద్యార్థుల్లో మానసిక సమస్యలు
- ధైర్యమివ్వాలంటున్న నిపుణులు

మదనపల్లె సిటీ: పరీక్షలు.. ఈ పేరు వినగానే పిల్లల్లో ఆందోళన సహజం. దీనికితోడు పాఠశాలల్లో టీచర్లతో పాటు ఇళ్లల్లో తల్లిదండ్రులు ర్యాంకుల కోసం ఒత్తిడి తీసుకురావడంతో వారు మరింత డిప్రెషన్‌కు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు.. ముఖ్యంగా పది, ఇంటర్ చదువుతున్నవారు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. పలువురు సైక్రియాటిస్టులను సంప్రదిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి, ఇంటర్ మార్చి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఒత్తిడికి గురయిన సందర్భంలో నేర్చుకున్న పాఠాలు మరచిపోతున్నారు.కొందరు అన్నం సరిగా తినడం లేదు. మరికొందరు పాసవుతామా లేదే అనే ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో తెలియక మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నారు.

అధిగమించాలిలా....

- గతంలో పది,ఇంటర్, జేఈఈ పరీక్షలు రాసిన సీనియర్ విద్యార్థుల నుంచి వారు ఎలా సన్నద్ధమయ్యారో తెలుసుకుని అందుకు తగ్గ టైం టేబుల్ రూపొందించుకుని ఆచరించాలి.
- చదవకపోతున్నా ..ఇంకేమైన ఆందోళనతో బాధపడుతుంటే వెంటనే తల్లిదండ్రులతో మాట్లాడాలి. అలాగే పిల్లలతో తల్లిదండ్రులు కూడా మాట్లాడాలి.
- నిత్యం మానసిక ప్రశాంతత కోసం యోగా చేయించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. విద్యార్థి ఒత్తిడికి గరవుతున్నాడని భావిస్తే తల్లిదండ్రులు అతనితో సరదాగా గడపాలి. ఈ సమయంలో పుస్తకాలు పక్కన పెట్టేయించాలి.
- పరీక్షలు ముగిసే వరకు టీవీలు, సెల్‌ఫోన్లు వాడకానికి స్వస్తి పలకాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలకు నచ్చజెప్పాలి. ఏది చేసినా పిల్లల సమ్మతితో చేస్తే మానసికంగా వారు అందుకు సంసిద్ధమవుతారు.
- తేలిగ్గా అరిగే ఆహారం తీసుకోవాలి. కచ్చితంగా 7–8 గంటల సేపు నిద్రపోవాలి.

జిల్లాలో ఇలాంటి సంఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువయ్యాయి. ఇది పరీక్షా సమయం.. విద్యార్థులకే కాదు.. తల్లిదండ్రులకు కూడా. పరీక్షా సమయంలో ఒత్తిడి ఎలా అధిగమించాలనే విషయాలపై కథనం.

కేసులు పెరిగాయి



టెన్త్, ఇంటర్ చదివే విద్యార్థులు అనేక మంది కౌన్సెలింగ్ కేంద్రానికి వస్తున్నారు. వారితో మాట్లాడితే దడ, వణుక వస్తుందని, ఛాతిలో నొప్పి ఉంటోందని, నోరు ఎండిపోతుంది, పరీక్షలు రాయలేమని, ఏం చదివినా గుర్తుండటం లేదని, నిద్ర పట్టడం లేదని, మార్కులు తక్కువ వస్తే తల్లిదండ్రులు కోప్పడతారు,తోటి విద్యార్థులు ఏడిపిస్తారని . ఇలా అనేక కారణాలు చెబుతున్నారు. సమస్యలు విని వాటిని అధిగమించడానికి కూర్చోబెట్టి కౌన్సెలింగ్ చేస్తున్నాం. –చాముండేశ్వరి, సైకియాట్రిస్టు, మదనపల్లె

ఒత్తిడి తగ్గించే ప్రణాళిక



పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడి తగ్గేలా ప్రణాళికలు చేశాం. టైం టేబుల్ ప్రకారం చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన మేరకు చదివిస్తున్నాం. విద్యార్థుల చదువుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. –శ్రీరాం పురుషోత్తం, డీఈఓ

అందరి క్షేమమే మా ఆకాంక్ష



ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: ప్రతి అంగన్ వాడీ వర్కర్, ఆయాలకు మంచి జరగాలన్నదే తమ ఆకాంక్ష అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో పరిష్కరించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ త్వరలో ఎన్నికలున్న నేపథ్యంలో కొందరు అంగన్‌వాడీలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూశాయని, వారికి ప్రభుత్వ నిర్ణయం చెంపపెట్టు లాంటిదన్నారు. అంగన్ వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందించిన సహకారాన్ని అందరూ గుర్తించుకోవాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించి ఇష్టానుసారంగా ప్రవర్తించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తమ ప్రభుత్వం సున్నితమైన సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఆర్థిక కారణాల దృష్ట్యా అంగన్ వాడీ సమస్యల పరిష్కార నిర్ణయంపై కొంత సమయం పట్టిందన్నారు. ఇకపై రాజకీయ కుతంత్రాలకు తావివ్వకుండా అంగన్ వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని శ్రీకాంత్ రెడ్డి ఉద్యోగులకు సూచించారు.

ఆల్ ఇండియా బీసీ ఫ్రంట్ కన్వీనర్‌గా నరసింహ



రాజంపేట: ఆల్ ఇండియా బీసీ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉమ్మడి కడప జిల్లా రాజంపేటకు చెందిన కెఎంఎస్ నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండురోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ కార్యవర్గ సమావేశాలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రధాన కార్యదర్శి ప్రీతం సింగ్ తెలియజేశారు. త్వరలో ఢిల్లీలో జరిగే కోర్ కమిటీ మీటింగ్‌లో జాతీయ కార్యవర్గాన్ని ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

పొదుపు సంఘాల మహిళలకు ఆసరా



పొదుపు సంఘాల మహిళలకు మెగా చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితరులు

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి
- జిల్లాలో 24,948 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,34,520 మంది మహిళలకు నాల్గవ విడతగా రూ. 223.11 కోట్లు మంజూరు

రాయచోటి: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా, ఉరవకొండ బహిరంగ సభ నుంచి నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం ఆర్థికసాయం మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వీసీ ముగిసిన అనంతరం నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జిల్లాలోని 24,948 స్వయం సహాయక సంఘాలకు చెందిన 2,34,520 మంది మహిళలకు మంజూరైన రూ. 223.11 కోట్లు మెగా చెక్కును జేసీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా అందించే ఆర్థికసాయం స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాలలో వెలుగులు నింపుతోందన్నారు. ఈ సాయం పొదుపు సంఘాల మహిళల జీవనోపాధికి బాటలు వేసి వారి ఆర్థిక ప్రగతికి ఆసరాగా నిలుస్తోందన్నారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, మహిళా సంఘాల లబ్ధిదారులు హాజరయ్యారు.

తంబళ్లపల్లె టీడీపీలో ఇంటిపోరు!

- టికెట్ తమకే అంటూ రెండు వర్గాల ప్రచారం
- జనసేన పొత్తులో ఓ ఎన్‌ఆర్‌ఐకి ఖరారంటూ మరో వర్గం
- ఎటుపోవాలో తేలక తమ్ముళ్ల తికమక



అంగళ్లు సభలో మాట్లాడుతున్న శంకర్

బి.కొత్తకోట: తంబళ్లపల్లె టీడీపీలో అసెంబ్లీ టికెట్ వ్యవహారం ముదిరిపాకాన పడింది. పార్టీ టికెట్ కోసం వర్గాల మధ్య పోరు సాగుతుంటే..వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసేది తానేనని ప్రకటించుకున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ అగ్నికి మరింత ఆజ్యం పోశారు. దీంతో శంకర్ వ్యతిరేక వర్గాలు టికెట్ తనకే అని ఎలా ప్రకటించుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2014 నుంచి శంకర్ టీడీపీలో ఉంటుండగా, ఈ మధ్యకాలంలో మరో ఇద్దరు టికెట్ తమకూ కావాలంటూ ప్రయత్నాలు మొదలు పెట్టారు. 'మీకెవ్వరికి కాదు మా నాయకుడికే టికెట్' అంటూ స్థానికంగా లేని మరో నాయకుడి వర్గం ప్రచారం మొదలెట్టింది. ఈనెల 19న బి.కొత్తకోటలో జరిగిన జయహో బీసీ సభలో తంబళ్లపల్లె టీడీపీ టికెట్ తనదే అని, పోటీచేస్తున్నట్టు శంకర్ ప్రకటించుకున్నారు. ఈ ప్రకటనపై తేలిగ్గా తీసుకున్న పోటీ వర్గాలకు పుండుమీద కారం చల్లినట్టుగా మంగళవారం కురబలకోట మండలం అంగళ్లులో జరిగిన బీసీ సభకు హాజరైన శంకర్ మాట్లాడుతూ టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్నానని మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు పార్టీ అధిష్టానం ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదని, స్వయంగా టికెట్ తనకేనని ఎలా ప్రకటించుకుంటారని కొందరు నేతలు శంకర్‌పై మండిపడుతున్నారు.

మరో ముగ్గురు ఆశావహులు

కాగా ఇటీవల టీడీపీలో చేరిన ఓ నాయకుడు లాబీయింగ్ ద్వారా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. రెండునెలల క్రితమే తెరపైకి వచ్చిన ఆయన..చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన ఫొటోలతో టికెట్ తనకే ఇస్తారని ప్రచారం చేసుకుంటుండడం గమనార్హం. టీడీపీ వర్గాల మద్దతు లేకపోయినా నియోజకవర్గంలో పర్యటనలు సాగిస్తున్నారు. గతనెలలో ఓ ఎన్‌ఆర్‌ఐ తాను టీడీపీలోనే ఉన్నానని, కొత్తగా పార్టీలో చేరాల్సిన అవసరం లేదని ప్రకటించి ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. టీడీపీ–జనసేన పొత్తులో తమ నాయకుడికి టీడీపీ లేదా జనసేన టికెట్ ఖరారైనట్టే అని ప్రచారం చేసుకుంటున్నారు. ఇకపోతే స్థానికంగా లేని ఓ నాయకుడి వర్గీయులు టీడీపీ టికెట్‌పై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తమ్ముళ్ల తికమక

టీడీపీ టికెట్ ఎవరికిస్తారో స్పష్టత లేకపోవడం తమ్ముళ్లు తికమక పడుతున్నారు. ప్రత్యక్షంగా టికెట్ కోసం మూడు వర్గాలు పోటీలో ఉండగా చివరకు ఎవరికి టికెట్ ఇస్తారో టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి స్పష్టత లేదు. దీంతో కార్యకర్తలు ఎవరికి టికెట్ వస్తుందో ఎవరికి మద్దతు ఇవ్వాలో అర్థంకాక ఆందోళనలో పడ్డారు. మరోవైపు తంబళ్లపల్లెలో టీడీపీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అసలే ప్రజల్లో వ్యతిరేకత ఉంది. పైగా వర్గాల మధ్య పోరు ముదిరి పాకాన పడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పదని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

ఆటాడేస్తున్నారు!

వారు పుస్తకాలతో కుస్తీయే కాదు.. ఆటతోనూ దోస్తీ చేశారు. అనవసర విషయాలను 'స్కిప్' చేసి అరుదైన రోప్ స్కిప్పింగ్ ఆటను ఎంచుకున్నారు. వీరి ప్రతిభకు.. పీడీ శిక్షణ తోడైంది. ఫలితంగా జిల్లా..రాష్ట్ర కాదు.. జాతీయస్థాయిలో పతకాల పంట పండింది. రోప్ స్కిప్పింగ్‌లో పతకాలు సాధించి భళా అనిపిస్తున్న మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక కథనం.

–మదనపల్లె సిటీ

- పతకాల వేటలో మదనపల్లె జెడ్పీ విద్యార్థులు..
- రోప్‌స్కిప్పింగ్‌లో జాతీయస్థాయిలో రాణిస్తున్న వైనం



రాష్ట్ర స్థాయికి ఎంపికైన రోప్‌స్కిప్పింగ్ క్రీడాకారులు



రోప్‌స్కిప్పింగ్ ఎంపికల్లో జెడ్పీ విద్యార్థులు

వహ్వా.. రిహాన్



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రిహాన్ 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు నూరుల్లా, నీలూఫర్. చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తితో క్రీడల్లో రాణిస్తున్నారు. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో గుంటూరు సత్తనపల్లిలో బంగారు, కర్నూలులో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో ఉన్నతస్థాయికి వెళ్లడమే ధ్యేయమని అంటున్నాడు.

ఆటలో ఉషస్సు



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉష విద్యతో పాటు ఆటల్లోనూ చురుకే. తల్లిదండ్రులు రమేష్, స్వర్ణలత. తండ్రి రైతు. పీడీ సుధాకర్ ఉష ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో కాంస్య పతకాలు సాధించింది. భవిష్యత్తులో ఒలపింక్స్ పాల్గొనడమే ధ్యేయమని చెబుతోంది.

ఖేల్ అంటే ఇష్టమంటున్న అఖిల్



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్.అఖిల్‌నాయుడు 9వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు మధుకర్, శిరీష. తండ్రి ఆటో డ్రైవర్. చిన్నప్పటి నుంచి అఖిల్‌కు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. పీడీ సుధాకర్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణించి పతకాలు సాధిస్తున్నాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయిలో రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని సిల్వర్ పతకం, మధ్యప్రదేశ్ భోపాల్ లో జరిగిన పోటీల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకాలు సాధించారు. జాతీయస్థాయిలో రాణించాలన్నదే తన ఆశయమని అఖిల్‌నాయుడు చెబుతున్నారు.

వారెవ్వా.. జస్వంత్



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జస్వంత్ పదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు శ్రీనివాసులు, చంద్రకళ, తండ్రి బిల్డర్. క్రీడలపై మక్కువతో పలు క్రీడల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో మధ్యప్రదేశ్ భోపాల్‌లో గోల్డ్‌మెడల్, గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, భీమవరంలో రజత పతకం సాధించారు. జిల్లా స్థాయిలో 15 పతకాలు సాధించారు. క్రీడల్లో రాణించి దేశానికి పేరుప్రఖ్యాతులు తెస్తానని జస్వంత్ ఉత్సాహంగా చెబుతున్నాడు.

క్రీడల్లో ప్రతిభ చూపుతున్న రమ్య



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రమ్య విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తోంది. తల్లిదండ్రులు నాగార్జునరెడ్డి, సరళ. తండ్రి దినసరి కూలి. పీడీ సుధాకర్ సలహాలు, సూచనలతో రోప్‌స్కిప్పింగ్‌లో రాణిస్తోంది. జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించింది. రాష్ట్ర స్థాయిలో కర్నూలు,గుంటూరు,భీమవరంలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది.క్రీడల్లో మంచి పేరు తెస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతోంది.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ శివారు ప్రాంతమైన అనపగుట్టకు చెందిన జగదీష్‌నాయక్ భార్య అర్చన (27) రెండు రోజుల నుంచి కన్పించడం లేదని స్థానిక టుటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్చన రెండు రోజుల క్రితం ఇంటి నుంచి ఉద్యోగం దరఖాస్తు చేసుకోవడానికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లింది. తరువాత ఇంటికి రాకపోవడంతో బంధువులు, మిత్రుల ఇళ్లలో విచారించారు. ఆచూకీ లభించకపోవడంతో టుటౌన్ పోలీసులకు భర్త జగదీష్‌నాయక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

సంబేపల్లె : ఇరవై మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని వడ్లపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో 12 మద్యం బాటిళ్లు, మండల కేంద్రంలో 8 మద్యం బాటిళ్లు వేర్వేరు వ్యక్తులు అమ్ముతున్నారనే ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వారిపై దాడులు నిర్వహించామన్నారు. 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విషం తాగి వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన లీలావతి

మదనపల్లె సిటీ : కుటుంబ కలహాలతో ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో మంగళవారం జరిగింది. చౌడేపల్లె మండలం కురప్పల్లికి చెందిన గిరి భార్య జి.లీలావతి (46) భర్తతో గొడవపడి మనస్థాపం చెందింది. ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు చౌడేపల్లె పోలీసులకు సమాచారం అందించారు.

పురిటి బిడ్డ మృతి



మృతి చెందిన పురిటి బిడ్డతో అలివేలు

మదనపల్లె సిటీ : మొదటి కాన్పులోనే పురిటి మగ బిడ్డ మృతి చెందిన సంఘటన మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగింది. బి.కొత్తకోట మండలం బీరంగి పంచాయతీ జరప్పల్లికి చెందిన నరేష్ భార్య అలివేలు ప్రసవ నొప్పులు రావడంతో సోమవారం రాత్రి జిల్లా ఆస్పత్రిలో చేరింది. తెల్లవారుజామున నొప్పులు రావడంతో నర్సులు పరీక్షించగా బిడ్డ మెడకు పేగు చుట్టుకోవడంతో మృతి చెందాడు. ఈ సంఘటనపై బాధితులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బిడ్డ మృతి చెందినట్లు ఆరోపించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని ఆమె తెలిపారు.

సూర్య నమస్కారం.. ఆరోగ్య యోగం

- సూర్య నమస్కారాలతో మానసిక, శారీరక ఆరోగ్యం
- మొగ్గు చూపుతున్న యువత

రాజంపేట : నవ్యత పేరుతో పాశ్చాత్య పోకడలో మనిషి ఆరోగ్యం నాశనం చేసుకుంటున్న ప్రస్తుత నేపథ్యంలో పురాతన భారతీయ ఆచార వ్యవహారాలు, సూర్యనమస్కారాలు ఆచరించేందుకు నేటి తరం మొగ్గుచూపుతోంది. చాలా సందర్భాలలో నా మాట వినవా.. మంచి శాస్తి జరిగిందా.. అయితే తూర్పు తిరిగి దణ్ణంపెట్టు.. అనే మాట ఊత పదంగా ఉపయోగిస్తారు. ఈ మాటతో వెక్కిరింత, ఎత్తిపొడుపు ఎలా ఉన్నా తెల్లవారుజామున, తిరిగి సాయంకాలం వేళ సూర్యునికి ఎదురుగా నిలబడి దండం పెట్టి కాసేపు నిలబడితే అంతా మంచి జరుగుతుందనేది నిరూపితమైన సత్యం. ఇలా చేయడం వల్ల సూర్యుని కాంతి నుంచి ప్రసరించే డి. విటమిన్ సహజసిద్ధంగా శరీరానికి అందుతుంది. తద్వారా ఎముకల పటుత్వం పెరిగి శారీరక బలం చేకూరుతుంది. చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరవు. దీని వల్ల స్వామికార్యం, స్వకార్యం రెండూ ఏక కాలంలో దుక్కుతాయనేది నిర్వివాదాంశం.

■ ప్రత్యక్షదైవం..

సూర్యభగవానుడు ప్రత్యక్షదైవమని నమ్మికొలిచే వారంతా ఎండలో నిలబడి ఆయనకు 12 రకాల భంగిమలలో శరీరాన్ని వంచి నమస్కారాలు చేస్తారు. ఇలా చేయడం వల్ల ఎండలో ఎక్కువ సేపు నిలబడాల్సి వస్తుంది. దీంతో ఎండలో ఉండే డి.విటమిన్ శరీరానికి పూర్తి స్థాయిలో అందుతుంది. డి.విటమిన్‌తో పాటు 12 భంగిమల్లో 12 రకాల ప్రయోజనాలు నిబిడీకృతమై ఉన్నాయి. ఆ వివరాలివే..

■ సూర్యునికి ఎదురుగా..

సూర్యునికి ఎదురుగా నిలబడి నమస్కారం చేయడం వల్ల మానసిక ఏకాగ్రత పెరుగుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది.



■ పాదహస్తాసనం..

రక్తప్రసరణలో లోపాలు తగ్గి నాడీ మండల వ్యవస్థ ఉత్తేజితమై కడుపులోని అవయవాల సామర్థ్యం పెరుగుతుంది.

■ చతురంగ దండాసనం

కాళ్లు, చేతులు, భుజ కండరాలు దృఢపడి శరీర సౌష్టవం పెంపొందుతుంది.

■ సాష్టాంగ నమస్కారం

గుండె కండరాలు బలోపేతమై గుండె పనితీరు మెరుగు పడుతుంది. హృదయ సంబంధిత వ్యాధులు దూరమవుతాయి.

■ హస్త ఉత్తనాసనం

దీనివల్ల చేతులు, భుజంలో ఉండే కండరాలు బలోపేతమవుతాయి. వెన్నెముక నరాలు ఉత్తేజితమై ఊపిరితిత్తులు శుభ్రమవుతాయి. తద్వారా శ్వాస సంబంధిత రోగాలు తగ్గుముఖం పడతాయి.

■ ఏకపాద ప్రసరనాసనం

కాళ్ల కండరాలు బలోపేతమై నాడీ మండలం అందించే సూచనలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సంబంధిత ప్రదేశాలకు నిరాటంకంగా చేరుతాయి.

■ భుజంగాసనం

సూర్య నమస్కారం చేయడం వల్ల వెన్నునొప్పి, ఉబ్బసం, సర్వైకల్ స్పాండలోసిస్ వంటి అనారోగ్యాలు దూరమై కుదుటపడతాయి.

■ పర్వతాసనం

చేతులు, భుజాల్ని బలోపేతం చేసే వెన్నెముక కండరాన్ని శక్తివంతం చేసి నడుం చుట్టూ ఉండే కొవ్వు కరుగుతుంది. మిగిలిన నాలుగు ఆసనాలు తిరిగి మొదటి నుంచి ప్రారంభమవుతాయి. ఇలా 12 రకాల సూర్యనమస్కారాలు ఉదయం సూర్యోదయం సమయంలో చేయడం వల్ల భక్తితో పాటు ఆరోగ్యం కలుగుతుంది.

ఆరోగ్యదాయిని



దేవతలు సైతం సూర్యనమస్కారాలు చేసేవారు. ఈ సంప్రదాయం ఇప్పటి నుంచి వస్తున్నది కాదు. వేల సంవత్సరాల క్రితం నుంచి సూర్యభగవానుడిని పూజించే క్రమంలో ఉదయమే సూర్యనమస్కారాలు చేస్తూ రావడం నేటికీ కొనసాగుతోంది. నేటి యువతీ, యువకులు కూడా పాటిస్తే ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఇది ఆరోగ్యదాయిని అని చెప్పవచ్చు.

- విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ఆధ్యాత్మికవేత్త, కడప

శారీరక, మానసిక ఆరోగ్యం



సూర్యనమస్కారాలు చేయడం మంచి సంప్రదాయం. శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. గంటలు కేటాయించాల్సిన అవసరంలేదు. రోజూ సూర్యోదయ సమయంలో 10 నుంచి 15 నిమిషాలు ప్రాక్టీస్ చేస్తే చాలు.

-భూమన శంకర్‌రెడ్డి, నందలూరు

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



మాది పేద కుటుంబం. దినసరి పనులు చేసుకుంటేనే ఇల్లు గడిచేది. గత ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా ఇంటి స్థలం ఇవ్వలేదు. అద్దె ఇంటిలో నివాసముంటున్నా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో నాకు ఇంటి స్థలం కేటాయించారు. స్థానిక చంద్రాకాలనీలో ఇల్లు కట్టుకుంటున్నా. రెండు నెలల్లో పూర్తి అవుతుంది. సొంత ఇంటి కల నెరవేరుతుంది. ఏ ముఖ్యమంత్రి చేయని పనులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

- ఈశ్వరమ్మ, కాలేజీ రోడ్డు, మదనపల్లె

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన చేస్తున్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కనీవినీ ఎరుగని రీతిలో ఆధునికంగా తయారయ్యాయి. విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, తదితర వాటిని అందించడంతో పాటు పుష్టికరమైన, మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధనతో పాటు ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విద్యాభివృద్ధిపై శ్రద్ధ చూపుతున్నారు.

- సి.జయచంద్ర, విద్యార్థి తండ్రి, ఎంపీపీ స్కూల్, ప్రొద్దుటూరు

పైసాఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు



ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పైసా ఖర్చు లేకుండా నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. మా ఇంటికి వచ్చి వలంటీర్ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకెళ్లి దరఖాస్తు చేశారు. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు వేదిక వద్దకు పిలిచి నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిత్యం ప్రజలకు ఏదో ఒక రకంగా మేలు చేయాలని చూస్తారు. కుల, ఆదాయ పత్రాలు కావాలంటే రుసుము చెల్లించాలి. కాని జగనన్న సురక్షలో ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

- రామాంజులమ్మ, ముసలికుంట కస్బా, పెద్దమండ్యం మండలం

చంద్రబాబు కుట్రలో భాగమే షర్మిల

- మ్యూజియంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఏపీకి తెచ్చారు
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు క్షమించరు
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : 'రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాదని నిర్ధారించుకుని ఆ పార్టీ అధినేత చంద్రబాబు అరు నెలలుగా ఎన్నో జిమ్మిక్కులు చేస్తూ రాష్ట్రంలో క్షుద్ర రాజకీయాలకు తెర లేపారు.. అందులో భాగంగానే షర్మిలను రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీని, చంద్రబాబును క్షమించరు' అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కుటుంబాలకు సంక్షేమం అందించి అభివృద్ధి చేస్తూ సుపరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రతి గడపకు పథకాలు చేరడంతో జగనన్నకు బ్రహ్మరథం పడుతున్న తీరు చూసి చంద్రబాబు గత ఆరునెలలుగా ఎన్నో జిమ్మిక్కులు చేస్తూనే ఉన్నారన్నారు. అందులో భాగంగానే మొదట దత్త పుత్రుడు పవన్ కల్యాణ్‌ను దింపారని ఆ ప్రయోగం కూడా విఫలం కావడంతో ఇప్పుడు కాంగ్రెస్‌తో కుమ్మక్కై వైఎస్సార్ కుటుంబాన్ని చీలుస్తూ వైఎస్ షర్మిలను పావుగా వాడుకున్నారన్నారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించి రెండు సార్లు అధికారంలోకి తెచ్చిన వైఎస్సార్‌ను ఆయన చనిపోయిన తరువాత నేరస్తుడిగా ఎఫ్ఐఆర్‌లో పేరు చేర్చడాన్ని కన్నకూతురు షర్మిల మరిచారా అని ప్రశ్నించారు. పునర్జన్మ లేని మృతదేహం కాంగ్రెస్ పార్టీ అని దానిని మ్యూజియంలో పెట్టి 10 సంవత్సరాలు దాటిందన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాబోయే ఎన్నికలలో 130కి పైగా సీట్లు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించి మనుగడ లేకుండా చేసి ఇక్కడి ప్రజలను ఇబ్బందులు పెట్టారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేసే కుట్రలు, కుతంత్రాలు, మంత్రాలకు చింతకాయలు రాలవని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే షర్మిలను తెలంగాణ నుంచి ఇక్కడకు తీసుకునివచ్చి రాజకీయం చేయాలనుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఏపీలో అడ్రస్‌లు లేని వారికి ఇక్కడ రాజకీయం చేసే అర్హతే లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత

వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ కల్పన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ కల్పన

కడప కార్పొరేషన్ : ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ కల్పన అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాస రెసిడెన్సీలో విద్యుత్ శాఖ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణతో కలిసి స్టాండర్డ్స్, లేబులింగ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో సహజ వనరులు అంతరించిపోతున్న తరుణంలో ఇంధన పొదుపు ఆవశ్యకతను నొక్కిచెప్పారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, గీజర్ వంటి వాటి వల్ల దేశంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదన్నారు. ఫలితంగా విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రాష్ట్ర వ్యాప్తంగా పది రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భారతదేశంలో 35 స్టార్ రేటెడ్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్ కూడా వీటిపై అవగాహన కల్పిస్తోందని చెప్పారు. రిటైలర్లు, డిస్ట్రిబ్యూటర్లు శక్తిని ఆదా చేయడానికి, విద్యుత్ బిల్లులను తగ్గించడానికి స్టార్ రేటెడ్ ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ డీఈఈ వి. పద్మజ ఏపీఎస్ఈసీఎం కార్యకలాపాలు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ గురించి వివరించారు. శక్తిని ఆదా చేసేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు ఎనర్జీ ఎఫిషియెంట్ స్టార్ రేటెడ్ గాడ్జెట్‌ల వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు డాక్టర్ జి.సుబ్రమణ్యం, వెంకట్‌రామన్ ఎస్అండ్ఎల్ ప్రోగ్రాం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, రిటైలర్లు పాల్గొన్నారు.

ఒంటరి జీవితం భరించలేక..

బి.కొత్తకోట : భర్త దూరమై ఒంటరి జీవితం భరించలేని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున బి.కొత్తకోటలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ మారుతిరెడ్డి కథనం మేరకు వివరాలు. స్థానిక కరెంట్ కాలనీలో నివాసం ఉంటున్న కె.లక్ష్మీదేవి, రెడ్డెప్పలు భార్యాభర్తలు. వీరికి సంతానం లేదు. భర్త రెడ్డెప్ప రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇటీవల లక్ష్మీదేవి కూడా అనారోగ్యానికి గురైంది. భర్త దూరం కావడం, పిల్లలు లేకపోవడంతో ఒంటరి జీవితంపై విరక్తి కలిగింది. దీంతో ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పరిశీలించారు. మృతురాలి అక్క కుమార్తె రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పి బావిలో పడిన ఆటో



ఆటో బావిలో పడిన దృశ్యం

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని తోల్లగంగనపల్లె సమీపంలో మంగళవారం ఆటో అదుపు తప్పి బావిలో పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వల్లూరు నుంచి కడపకు వెళుతున్న ఆటో తోల్లగంగనపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కనే వున్న పాడుబడ్డ బావిలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ఆటోను తాడు సహాయంతో బయటకు తీశారు. అదే సమయంలో ఆ దారిన కడపకు వెళుతున్న రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సంఘటనా సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న వల్లూరుకు చెందిన ముగ్గురు బాలికలతో పాటు ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

దొంగల ముఠా అరెస్టు

86 గ్రాముల బంగారం, రూ.1.50లక్షలు స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

గాలివీడు : జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగాధర్ బాబు తెలిపారు. మంగళవారం గాలివీడు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన విక్రమ్‌పళణి, కుమార్ ఆదిత్యలు తరచూ దొంగతనాలకు పాల్పడేవారన్నారు. గృహాలలో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి ఇంటిలోని నగదు, బంగారాన్ని దొంగిలించేవారన్నారు. డీఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతో మండల ఎస్‌ఐ వెంకటశివకుమార్, సిబ్బంది అల్తాఫ్, ఈశ్వర్‌నాయక్, షఫీలతో కలిసి దొంగల ముఠా సభ్యులను చాకచక్యంగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 86 గ్రాముల బంగారం, రూ.1.50లక్షలు నగదును స్వాధీనం చేసుకొని నిందితులను లక్కిరెడ్డిపల్లె కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వీరిపై సంబేపల్లె పోలీస్ స్టేషన్‌లో కూడా గతంలో కేసులు నమోదయ్యాయన్నారు.

వృద్ధుడి అదృశ్యం



ఇరువురి గంగయ్య (ఫైల్)

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ముదినేపల్లి దళితవాడకు చెందిన ఇరువురి గంగయ్య (75) అనే వృద్ధుడు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగయ్య మేకలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దికాలం క్రితం భార్య మృతి చెందింది. ఈ నేపథ్యంలో మతి స్థిమితం కోల్పోయాడు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. గంగయ్య ఆచూకీ తెలిస్తే 8498947085 నంబరుకు సమాచారం ఇవ్వాలని అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి

లబోదిబో మంటున్న పీఎంఏవై లబ్ధిదారుడు



బొజ్జా బాలకొండయ్య నిర్మించుకున్న ఇల్లు

పోరుమామిళ్ల : సంచర్ల పంచాయతీ నాగలకుంట్లకు చెందిన బొజ్జా బాలకొండయ్యకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పక్కా ఇల్లు మంజూరైంది. దీంతో అతను ఇల్లు నిర్మించుకున్నాడు. అయితే ఆ ఇంటికి చెందిన డబ్బు అదే గ్రామానికి చెందిన అదే పేరుగల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అకౌంటుకు జమ చేశారు. నాలుగు విడతలుగా రూ. 1,10,000 అతని అకౌంటులో వేశారు. ఈ విషయమై లబ్ధిదారుడు హౌసింగ్ ఏఈని అడిగితే ఎక్కడో పొరపాటు జరిగిందని, కోర్టులో కేసు వేయమని ఉచిత సలహా ఇచ్చారు. సదరు ఉద్యోగి లబ్ధిదారుని సమీప బంధువే కావడంతో పొరపాటున డబ్బు నీ అకౌంటులో జమ అయింది, దాన్ని ఇవ్వాలని కోరితే అతను కుంటిసాకులు చెబుతూ ఇవ్వడం లేదని లబ్ధిదారుడు వాపోతున్నాడు. లబ్ధిదారుని ఆధార్, అకౌంట్ నంబర్ సరి చూసుకోకుండా, ప్రభుత్వ ఉద్యోగి అకౌంటులో ఎలా జమ చేశారో హౌసింగ్ ఏఈ స్పష్టం చేయడం లేదు. దీనిపై హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలి

జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో జేసీ గణేష్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేష్

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్య సేవలను అందించాలని జాయింట్ కలెక్టర్ గణేష్ తెలిపారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సేవల గురించి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు జేసీకి వివరించారు. వైద్య సేవలపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీహెచ్ఎస్ హిమదేవి మాట్లాడుతూ ఓపీ బాగా పెరిగినట్లు చెప్పారు. ఈ ఔషధి చేయడానికి ఫార్మసిస్టు కొరత ఉన్నప్పటికీ ఇబ్బంది కలగకుండా ఇతర విభాగాల సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. గతంలో కంటే శానిటేషన్ మెరుగుపడిందన్నారు. స్టెమీ కార్యక్రమం కింద గుండె సంబంధిత కేసులకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గుండె పోటుతో ఆస్పత్రికి వచ్చిన వారికి ఖరీదైన త్రాంబోలైసిస్ ఇంజక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జునరెడ్డి, ధనలక్ష్మి, వల్లంకొండు శివసత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ, ఆర్ఎంఓ రూపాదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఈఈ శరత్‌చంద్రారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీజీ మహేష్, మెప్మా సభ్యురాలు బండి లక్ష్మీదేవి, వైద్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వేంపల్లె : స్థానిక ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద 50 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నందిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతుండగా 50 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన గీతారాణి

గాలివీడు : మండల పరిధిలోని నూలివీడు గ్రామం నక్కలవాండ్లపల్లెకు చెందిన నక్కల గీతారాణి(31) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు నక్కలవాండ్లపల్లెకు చెందిన నక్కల వెంకటరమణారెడ్డి 13 ఏళ్ల క్రితం ప్యారంపల్లె గ్రామం పెడకంటి కొత్తపల్లెకు చెందిన గీతారాణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో 10 సంవత్సరాల క్రితమే విడిపోయారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో జీవనోపాధికి టైలరింగ్ చేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తుండేది. భర్త, కొడుకు తోడు లేకపోవడంతో మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురైంది. ఈ నేపథ్యంలో అమ్మగారి స్వగ్రామమైన పెడకంటి కొత్తపల్లెలోని వ్యవసాయ పొలాల వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈమేరకు గాలివీడు ఎస్‌ఐ వెంకటశివకుమార్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.